

ఇరుకిరుకుగా 8
వినాయక చౌరస్తా
రోడ్డు విస్తరణలో
తీవ్ర జాప్యం
తరచూ ప్రమాదాలు
తప్పని తిప్పలు



## సదస్సుల్లోనే భూ సమస్యలను పరిష్కరించాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



అత్వెల్లి గ్రామ రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను సాధ్యమైనంత వరకు రెవెన్యూ సదస్సుల్లోనే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశించారు. గురువారం వికారాబాద్ మండలం అత్వెల్లి గ్రామం, వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని కొత్రేపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్జీదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన దరఖాస్తుల వివరాల నమోదుపై ఆరా తీశారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు అందించాలని, సంబంధిత రిజిస్టర్లలో వివరాలు నమోదు చేయాలని సూచించారు. సమస్యల వారీగా అర్జీలను విభజిస్తూ, పక్కాగా రికార్డులను పొందుపర్చాలన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, రెవెన్యూ డివిజనల్ అధికారి వాసు చంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా వంద రోజుల ప్రణాళిక

- మున్సిపల్ పరిపాలనా శాఖ డిప్యూటీ డైరెక్టర్ జ్యోత్స్న



రాంపల్లిలో మొక్క నాటి నీరు పోస్తున్న జ్యోత్స్న, కమిషనర్ భాస్కర్‌రెడ్డి

కీసర రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వంద రోజుల ప్రణాళిక పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ పరిపాలనా శాఖ డిప్యూటీ డైరెక్టర్ జ్యోత్స్న అన్నారు. గురువారం నాగారం మున్సిపాలిటీలో పర్యటించారు. ముందుగా నాగారం మున్సిపల్ పరిధిని 3వ వార్డులోని పార్కులో మొక్కలు నాటారు. యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను, కంపోస్ట్ తయారీ కేంద్రాన్ని సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. నాగారం మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో పాల్గొని ఉత్పత్తులను పరిశీలించారు. వ్యాపార లైసెన్సుల జారీని పరిశీలించారు. రాంపల్లి ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా చిత్రీకరించిన పెయింటింగ్‌ను ఆసక్తిగా చూశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ భాస్కర్‌రెడ్డి, మేనేజర్ సురేష్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొందరికే భరోసా!



## అర్హులందరికీ అందని పెట్టుబడి సాయం

సాగు పెట్టుబడి సాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం అందరికీ వర్తించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ సాయం కొందరికే పరిమితమైంది. రంగారెడ్డి జిల్లాలో జీహెచ్ఎంసీ పరిధిలోని తొమ్మిది మండలాల రైతులకు ఒక్క రూపాయి కూడా జమ కాలేదు. అలాగే మేడ్చల్ జిల్లాలోని పదకొండు మండలాల్లో ఒక్క మండలం(మూడుచింతలపల్లి) పరిధిలోని రైతులకు మాత్రమే రైతు భరోసా పైసలు పడ్డాయి. మిగిలా వారంతా పెట్టుబడి సాయం అందక ఆందోళన చెందుతున్నారు. మాకెందుకు డబ్బులు పడలేదని, బ్యాంకు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. డబ్బులు ఎందుకు రాలేదో తెలియక అధికారులు కూడా ఏం సమాధానం చెప్పలేక పోతున్నారు.





- పలువురు రైతులకు సగం డబ్బులే జమ
- రంగారెడ్డి జిల్లాలో 9 మండలాల్లో అసలే అందని వైనం
- మేడ్చల్‌లో 11 మండలాల్లో ఒక్క మండలానికే పరిమితం
- సాయం అందకపోవడంతో ఆందోళనలో రైతులు
- వ్యవసాయ, బ్యాంకు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- విధిలేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు
- మంత్రి తుమ్మలను కలిసిన బీఆర్ఎస్ నేతలు
- రెండు రోజుల్లో క్లారిటీ ఇస్తానన్న వ్యవసాయ మంత్రి

మేడ్చల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) /రంగారెడ్డి అర్బన్: వానాకాలం సీజన్‌లో పంటలు సాగు చేసేందుకు రైతన్నలు సిద్ధమయ్యారు. విత్తనాలు విత్తేందుకు దుక్కులు దున్నుకున్నారు. సాగు చేసే ప్రతీ ఎకరానికి రూ.6వేల చొప్పున పంట పెట్టుబడి ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీ మేరకు అమలుకు నోచడం లేదు. కేవలం 4 ఎకరాల్లోపు సాగు చేసిన రైతులకు మాత్రమే రూ.6వేలు జమ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. దీంతో నాలుగు ఎకరాల పైబడి సాగు చేసే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయలేదు. దీంతో అన్నదాతలు నిరాశ చెందుతున్నారు. కొంతమందికి నాలుగు ఎకరాల్లోపు ఉన్నవారికి కూడా సగం డబ్బులు మాత్రమే జమ కావడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వానాకాలం సీజన్ ప్రారంభంలో ముందస్తుగా వర్షాలు కురవడంతో రైతులు భూములను చదును చేసుకొని పంటల సాగుకు సిద్ధమయ్యారు. పంట పెట్టుబడి

మిగతా 7వ పేజీలో...

### పెట్టుబడిసాయం అందించాలి



యాసంగి, వానాకాలం పంటలకు రైతు భరోసా ఇవ్వలేదు. ఎన్నిసార్లు అధికారుల వద్దకు వెళ్లి అడిగినా జిల్లాకు రాలేదు, వచ్చినప్పుడు చెబుతామని పంపిస్తున్నారు. రాష్ట్రమంతా రైతులకు పెట్టుబడిసాయం అందించి మేడ్చల్ జిల్లా రైతులకు మాత్రం ఎందుకు ఇవ్వడంలేదు. మే రైతులం కాదా? మేము పండించేది ధాన్యంకాదా? ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలి.

- బొక్క శ్రీనివాస్‌రెడ్డి, రైతు, బొక్కోనిగూడ, ఘట్‌కేసర్ మండలం

ఒక్క మండలానికే సాయం
మేడ్చల్‌లో మొత్తం 11 మండలాలు
ఆందోళనలో ఓఆర్ఆర్ సమీప మండలాల రైతులు
7

### మంత్రి తుమ్మలను కలిసిన మంచిరెడ్డి, సబితారెడ్డి

ఇబ్రహీంపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 9 మండలాల్లో రైతు భరోసా నిలిపివేయడం తగదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డిలు గురువారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిశారు. వానాకాలం పంటల సాగు మొదలైందని, పెట్టుబడి సాయాన్ని నిలిపివేయడంపై రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కాగా అధికార యంత్రాంగంతో మాట్లాడి రెండు రోజుల్లో స్పష్టతనిస్తామని మంత్రి వారికి వివరించారు. కాగా వీరి వెంట బీఆర్ఎస్ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి ఉన్నారు.

### ఆలస్యంగా రావొచ్చు



జిల్లాలోని జీహెచ్ఎంసీ పరిధిలోని గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, మహేశ్వరం, బాలాపూర్, శేరిలింగంపల్లి, హయత్‌నగర్ మండలాల్లో రైతు భరోసా రాలేదు. ఆసల్యంగా రావొచ్చు.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- నర్సింహారావు, రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి



మేడ్చల్ కలెక్టర్ మనుచౌదరికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

## ఐదు తరగతులు.. ఒక టీచర్

బషీరాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్యాబోధన చేస్తున్నామని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. వారి మాటలు నమ్మి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించారు. ఉపాధ్యాయులు తక్కువున్న పాఠశాలలకు టీచర్లను వేరేచోట్ల నుంచి సర్దుబాటు చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. కానీ పాఠశాలల్లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. బషీరాబాద్‌లోని టాకీతండా పాఠశాలలో ఐదు తరగతుల్లో 36 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ ఒక్క ఉపాధ్యాయురాలే ఉన్నారు. విద్యార్థులందరినీ ఒకే రూంలో కూర్చోబెట్టి బోధిస్తున్నారు. ఇక్కడ ఇద్దరు రెగ్యులర్ టీచర్లు మెటర్నిటీ లీవ్‌పై వెళ్లడంతో రెండు పోస్టులూ ఖాళీగా ఉన్నాయి. ఇటీవల నియామకమైన కాంట్రాక్ట్ టీచర్‌ను ఇందిరనగర్ కాలనీ పాఠశాల నుంచి ఇక్కడికి డిప్యూటేషన్‌పై పంపారు. ఇక్కడ ఇద్దరు టీచర్లు ఉండాలి. ఐదు తరగతులకు ఒక్క టీచరే బోధించాల్సి రావడంతో పిల్లలు చదువులో వెనకబడుతారని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఒకే క్లాస్ రూంలో కూర్చున్న అన్ని తరగతుల విద్యార్థులు

## 2047 నాటికి సికిల్ సెల్ నిర్మూలన

- జిల్లా వైద్యాధికారి వెంకటరవణ



ర్యాలీని ప్రారంభిస్తున్న వెంకటరవణ

వికారాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిని 2047 నాటికి నిర్మూలించడమే లక్ష్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరవణ పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఆవరణలో అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సికిల్ సెల్ ఎనిమియా నిర్మూలన కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం 2023లో ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించిందని, ఈ వ్యాధి గిరిజనుల్లో ఎక్కువగా కన్పిస్తుందన్నారు. సకాలంలో ఈ వ్యాధిని గుర్తించి అవసరమైన చికిత్స అందిస్తే దాని ప్రభావాన్ని తగ్గించవచ్చని తెలిపారు. జిల్లాలోని చెంచు, ఇతర ఆదివాసీ ప్రాంతాల్లో ఈ వ్యాధిపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రయ్య, డాక్టర్లు బుచ్చిబాబు, డాక్టర్ నిఖిల్, డాక్టర్ రోహిత్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, మహేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

## పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యం

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

వికారాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వికారాబాద్ పట్టణానికి చెందిన 359 మంది, వికారాబాద్ మండలానికి చెందిన 254 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారు వెంటనే పనులు మొదలు పెట్టాలన్నారు. ఈ ఏడాది 4.5 లక్షల ఇళ్ల నిర్మాణానికి బడ్జెట్లో రూ.22,500 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. నియోజకవర్గానికి ప్రత్యేకంగా 7,000 ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని, ఇల్లు లేని పేదలందరికీ ఏడాదికి కొంతమందికి ఇళ్లు మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా పేదలకు సంక్షేమ ఫలాలు అందుతాయని, వానాకాలం రైతు భరోసా డబ్బులు జమ అవుతున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో వికారాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో రూ.60 లక్షల నుంచి కోటితో సీసీ రోడ్లు వేయించామని తెలిపారు. నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామని, పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. రూ.వెయ్యి కోట్లతో అనంతగిరిని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం మెగా సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నదని తెలిపారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ మహిళా శక్తి మన దుకాణం స్టాల్‌ను కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, డీఆర్డీఓ శ్రీనివాస్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, ఆర్డీఏ సభ్యులు జాఫర్, నాయకులు సుధాకర్ రెడ్డి, సత్యనారాయణ, రాజశేఖర్ రెడ్డి, సామ రాంచందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఊరు మాయం.. పేరు పదిలం

కొడంగల్ రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు గ్రామాలు లేకున్నా వాటి పేర్లు మాత్రం రెవెన్యూ రికార్డుల్లో పదిలంగా ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం గండ్లేపల్లి, అప్పాయిపల్లి గ్రామాలు ఉండేవని, ప్లేగు బారిన పడి చాలా మంది చనిపోవడంతో భయాందోళనకు గురైన స్థానికులు ఊళ్లను ఖాళీ చేసి వెళ్లిపోయారు. గండ్లేపల్లి గ్రామస్తులు టేకులకోడ్‌లో, అప్పాయిపల్లి గ్రామస్తులు ఎరాన్‌పల్లిలో స్థిరపడినట్లు అయా గ్రామల పెద్దలు చెబుతారు. అయితే ఆ రెండు గ్రామాల పేర్లు మాత్రం నేటికీ రెవెన్యూ రికార్డుల్లో పదిలంగా ఉన్నాయి. ఎవరైనా మండలానికి కొత్తగా వచ్చిన అధికారి రికార్డుల ప్రకారం ఆ రెండు గ్రామాలకు వెళ్తే అక్కడ గ్రామాలు కనిపించవు. గతంలో ఊరు ఉన్న కోట బురుజులు, ఇళ్ల ఆనవాల్లు, అమ్మవారి గుడులు, శిథిలావస్థకు చేరిన ఆంజనేయస్వామి ఆలయం కన్పిస్తాయి. గండ్లేపల్లి రికార్డుల వివరాలు తెలుసుకునేందుకు టేకులకోడ్, అప్పాయిపల్లి రికార్డుల వివరాలు తెలుసుకునేందుకు ఎరాన్‌పల్లి గ్రామానికి వెళ్లి తెలుసుకోవలసిందే.



గండ్లేపల్లిలో కోట బురుజు

## మహా సభలను జయప్రదం చేయాలి

- సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్



మాట్లాడుతున్న ఉమామహేశ్

మేడ్చల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మూడేళ్లకోసారి నిర్వహించే సీపీఐ తెలంగాణ 4వ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ఉమా మహేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం బొమ్మరాశిపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర మహా సభలను కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారంలో నిర్వహిస్తున్నామని, ఇందులో రాష్ట్ర నలుమూలల నుంచి 1,000 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. భవిష్యత్తు కార్యక్రమాలపై ఈ మహా సభల్లో చర్చిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కువగా పరిశ్రమలున్నాయని, పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కబ్జాలు పెరిగిపోతున్నాయని, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని పేద ప్రజలకు పంచి పెట్టాలన్నారు. జిల్లాలో కేవలం నాలుగు డిగ్రీ కాలేజీలే ఉన్నాయని, పేద విద్యార్థులు ప్రభుత్వ తీరుతో విద్యకు దూరమౌతున్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, సత్యప్రసాద్, శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు రాములుగౌడ్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

## సహాయ ఉపకరణాలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగులు సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి కృష్ణవేణి కోరారు. ప్రభుత్వం దివ్యాంగుల సహకార సంస్థ ద్వారా పరికరాలు, లెర్నింగ్ మెటీరియల్, ఎంఆర్సీ చప్పల్ ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. శారీరక దివ్యాంగులు, అంధులకు, బధిరులకు, మానసిక దివ్యాంగులకు రెట్రోఫిట్టెడ్ మోటరైజ్డ్ వెహికిల్స్, బ్యాటరీ వీల్ చైర్లు, మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిల్స్, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వెహికిల్స్, హైబ్రిడ్ వీల్ చైర్ అటాచ్‌మెంట్, వీల్ చైర్, ల్యాప్‌టాపులు, ట్యాబ్స్, 4జీ స్మార్ట్‌ఫోన్లు, ట్రైసైకిళ్లు, క్యాలిపెర్స్, ఆర్టిఫిషియల్ లింబ్స్, క్రచెస్, వాకింగ్ స్టిక్స్, స్మార్ట్ కేన్స్, బ్రెయిలీ బుక్స్ బ్రెయిలీ కిట్స్, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్, ఎంఆర్సీ చప్పల్స్ ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువును పొడిగించినట్లు తెలిపారు. వెబ్‌సైట్‌లో అన్ని ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చిన దరఖాస్తులను జిల్లా ఎంపిక కమిటీ పరిశీలించి అర్హత కలిగిన దివ్యాంగులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

వికారాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన నిధులు ఖర్చు చేయాలని అధికారులకు సూచించారు. దీర్ఘకాలికంగా పేరుకుపోయిన ఎస్సీ, ఎస్టీ భూముల సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి జూలై నుంచి కార్యాచరణ రూపొందించాలన్నారు. ప్రతినెలా చివరి శనివారం పౌర హక్కుల దినం నిర్వహించి తహసీల్దార్, పోలీసు అధికారి హాజరయ్యేలా శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. జిల్లాలోని సమస్యలు తెలుసుకునేందుకు మూడు నెలలకోసారి డీవీఎంసీ సమావేశాలు నిర్వహించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మూఢ నమ్మకాలు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సీఎంకు సంబంధించిన జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు చకచకా పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ

మిగతా 8వ పేజీలో...

విక్రమ్ సారా భాయ్ సైన్స్ ఫౌండేషన్ పరీక్షలో

## జూబ్లీహిల్స్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



జోయెల్ లక్రను అభినందిస్తున్న మురళీముకుంద్

కీసర, జూన్19(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా నిర్వహించే విక్రమ్ సారా భాయ్ సైన్స్ ఫౌండేషన్ పరీక్షలో నాగారం మున్సిపల్ పరిధి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ప్రతిభ చాటాడు. ఇటీవల సైన్స్ ఫౌండేషన్ అధ్వర్యంలో మూడో తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు స్పాట్ అసెస్మెంట్ ఆన్‌లైన్ ప్రిలిమ్స్‌కు జూబ్లీహిల్స్ స్కూల్ విద్యార్థి జోయెల్ లక్ర రెండుసార్లు అర్హత సాధించాడు. మెయిన్స్ స్పాట్‌లో 100లో నాలుగో స్థానం సాధించి, పుణేలోని లీడింగ్ స్పేస్ సెంటర్‌లో ఐదు రోజులు ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్నాడు. గురువారం స్కూల్ ప్రెసిడెంట్ ఎ. మురళీముకుంద్ జోయెల్‌కపది వేల రూపాయాల నగదు పురస్కారం అందజేశారు. దేశ కీర్తి, ప్రతిష్టలు ప్రపంచ వ్యాప్తం చేయాలని ఆకాంక్షించారు.

## ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి

చౌదరిగూడ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లు రాజకీయ, ఆర్థిక రంగాల్లో రాణించాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ సాధికారిత కోసమే మెపాను స్థాపించినట్లు చెప్పారు. త్వరలో మండలంలోని గ్రామాల్లో మెపా కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం జిల్లేడ్ చౌదరిగూడ మండలం గాలిగూడకు చెందిన శివకుమార్‌ను మెపా మండలాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సభ్యులకు శివకుమార్ ధన్యవాదాలు తెలిపారు.





గున్‌గల్ సమీపంలో నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారి పక్కన ధ్వంసమైన పొదల్లో కలిసిపోయిన రెయిలింగ్

## ధ్వంసమైన రెయిలింగ్‌లు

● పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు

యాచారం, జూన్19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గున్‌గల్‌లో నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారికి రెండు పక్కల ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన హైవే రెయిలింగ్‌లు ధ్వంసమైనా అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డు ఎత్తుగా ఉన్న చోట్ల రోడ్డుకు ఇరువైపులా 8ఏళ్ల క్రితం రెయిలింగ్‌లను ఏర్పాటు చేశారు. రహదారిపై ప్రమాదాలు జరిగి వాహనాలు బోల్తాపడి రెయిలింగ్‌లపై పడడంతో అవి ధ్వంసమయ్యాయి. వాహనదారులకు రెయిలింగ్‌లు కనపడకుండా ముళ్ల పొదల్లో కలిసిపోయాయి. దీంతో సూచిక కోసం ఏర్పాటు చేసిన రెయిలింగ్‌లతో ప్రయోజనం లేకుండా పోయింది. డ్రైవర్లకు రోడ్డు ఎత్తు పల్లాలు, మలుపుల గురించి దగ్గరి వరకు వచ్చే దాకా తెలియని పరిస్థితి ఉంది. రోడ్ల పక్కన రెయిలింగ్‌లు ఉంటే వాహనాల డ్రైవర్లు తక్కువ వేగంతో వెళ్తారు. ఎదురుగా వచ్చే వాహనాలను అంచనా వేసుకుంటారు. కొత్త రెయిలింగ్‌ల ఏర్పాటుపై రోడ్లు భవనాల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. పలుచోట్ల ముళ్లపొదలు రోడ్డుపైకొస్తున్నా తొలగించడంలేదు. కలెక్టర్ కల్పించుకొని రెయిలింగ్‌లను ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.

# రూ.600కోట్లతో గ్రామీణ రోడ్ల అభివృద్ధి

తలకొండపల్లి, జూన్19(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలో రూ.600 కోట్లతో గ్రామీణ రోడ్లను ఆధునికీకరిస్తున్నట్టు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గానికి మహర్దశ వచ్చిందన్నారు. కల్వకుర్తి నుంచి గట్టిప్పలపల్లి, రాంపూర్ మీదుగా తలకొండపల్లి వరకు నడిచే ఆర్టీసీ బస్సు సర్వీసును గురువారం డిపో మేనేజర్ సుభాషిణితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని తండాలకు, గ్రామాలకు బీటీరోడ్లు వేస్తామన్నారు. ప్రతీ పల్లెకు బస్సు నడవాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు.



జెండా ఊపి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

రద్దీకి అనుగుణంగా డిపోకు కొత్తగా 16 బస్సులను కేటాయించారన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, రేణురెడ్డి, హరిమోహన్‌రెడ్డి, బోల్ల యాదగిరి, షాబుద్దీన్, రాములు, బాల్‌రాజ్, కృష్ణనాయక్, బ్యాగి ఆనంద్‌కుమార్, వెంకటేశ్, పర్వత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### భూ ఆక్రమణలపై కఠినంగా ఉండాలి

ఆమనగల్లు: ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి, ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల, వెల్దండ మండలాల్లో విద్యుత్, రెవెన్యూ సమస్యలపై ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రజలు, రైతుల ఇబ్బందులపై తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. నిషేధిత జాబితా భూముల సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణపై నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తేగా వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ వేయాలని తెలిపారు. అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులను కోరారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లు, స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. మంజూరైన సబ్‌స్టేషన్లను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు లలిత, ముంతాజ్, నాగార్జున, వినయ్‌సాగర్, కార్తీక్, ఇబ్రహీం, సునీత, ట్రాన్స్‌కో డీఈఈలు గోపాల్, శ్రీధర్‌శెట్టి, ఏడీఈలు బాలకృష్ణ, శంకరయ్య, ఏఈలు నరేందర్, శంకర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, భట్టు కిషన్‌రెడ్డి, బిచ్యానాయక్, జగన్, మోతీలాల్, శ్రీకాంత్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా ఇవ్వాలని ఆందోళన

కీసర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా నిధులు మంజూరు చేయాలని రైతులు గురువారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధి కీసరలో రైతులు ఆందోళన చేశారు. ప్రభుత్వం జనవరి 26 నుంచి ఇప్పటి వరకు రెండు సార్లు రైతు భరోసా ఇచ్చిందన్నారు. కానీ మేడ్చల్ జిల్లాలో కీసర మండలం భోగారంలో తప్ప, మరే ఇతర గ్రామాల రైతులకు రైతు భరోసా ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అందరికీ రైతు భరోసా ఇస్తామని చెప్పి ఇప్పుడు విస్మరించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సరికాదని రైతులన్నారు. దుక్కులు దున్నే సమయమొచ్చిందని, వెంటనే తమకు రైతు భరోసా మంజూరు చేయాలని సొసైటీ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి అధ్వర్యంలో మేడ్చల్ కలెక్టర్ మనుచౌదరికి వినతి పత్రం అందజేశారు.

## యాదవ సంఘం ఆర్థిక సాయం

ఆమనగల్లు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నారమోని మల్లేశ్‌యాదవ్ కుటుంబానికి ఆమనగల్లు శ్రీకృష్ణయాదవ సంఘం చేయూతనందించింది. అండగా ఉంటామని నాయకులు భరోసా ఇచ్చారు. ఆమనగల్లుకు చెందిన మల్లేశ్ వెల్దండ మండలం చెర్కూర్ గేటు వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం అతడి కుటుంబాన్ని సంఘం నాయకులు పరామర్శించారు. సంఘం తరపున రూ.1.5లక్షలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తోట గిరి యాదవ్, బి.శ్రీశైలం, గిరి, అశోక్, రాములు, నర్సింహ ఉన్నారు.

## తెలంగాణ అభివృద్ధిలో కేంద్రానిదే పైచేయి

చౌదరిగూడ/షాద్‌నగర్ రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): 11ఏళ్ల కాలంలో బీఆర్ఎస్, నేడు కాంగ్రెస్ ప్రభుత్వాలు దోచుకోవడంపై ఉన్న శ్రద్ధ పాలనపై పెట్టలేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య ఆరోపించారు. గురువారం కొందుర్గులో బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రచ్చబండ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదకొండేళ్లుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుస్థిర పాలన అందిస్తున్నారన్నారు. తెలంగాణ అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వానిదే కీలకపాత్ర అన్నారు. జాతీయ రహదారులు, రైల్వేస్టేషన్లు, లైన్ల ఆధునికీకరణ, కొత్త



కేంద్ర పథకాలపై ప్రజలకు వివరిస్తున్న నాయకుడు బాబయ్య

విద్యుత్ లైన్లు వంటివి కేంద్ర ప్రభుత్వమే చేపట్టిందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలకులు దోచుకోవడమే ఎజెండాగా పనిచేస్తున్నారని విమర్శించారు. నరేంద్రమోదీ వికసిత్ భారత్‌గా మలిచేందుకు అనేక చట్టాలను అమలు చేస్తున్నారన్నారు. ఉచిత సిలిండర్లు, ఉచిత బియ్యం, ఆయుష్మాన్ భారత్, కిసాన్ సమ్మాన్, ఫసల్ బీమా, ఆవాస్ యోజన, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వంటివి అమలు చేశారని వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మయ్యగౌడ్, శివారెడ్డి, శ్రీశైలం, బల్వంతరెడ్డి, కురుమయ్య, ప్రశాంత్, అంజయ్య, చంద్రశేఖర్, కార్తీక్‌చారి, సురేష్, రాంచంద్రయ్య, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం బూర్గులలో అందె బాబయ్య మాట్లాడుతూ.. 11ఏళ్లుగా మోదీ అవినీతి రహిత పాలన అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్, బీజేపీ మండలాధ్యక్షుడు పిట్టల వెంకటేశ్ శివశంకర్, కృష్ణ, యాదగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దాతల సహకారం అభినందనీయం

వికారాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు పనిచేసిన పాఠశాలల అభ్యున్నతికి సహకారం అందించడం అభినందనీయమని సిద్దులూరు జెడ్పీ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం పి.రామకృష్ణారెడ్డి అన్నారు. బడిమాట కార్యక్రమం ముగింపు సందర్భంగా పాఠశాలలో క్రీడా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. జీహెచ్‌ఎం రామకృష్ణారెడ్డి చొరవతో నవాబ్‌పేట మండలం పులుమామిడి జెడ్పీహెచ్ఎస్ రిటైర్డ్ జీహెచ్‌ఎం, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పురుషోత్తంశాస్త్రి పాఠశాలకు రూ.లక్ష విలువ గల వస్తు, సామగ్రిని విరాళంగా అందజేశారు. మైక్ సెట్, ప్రింటర్, 4 ర్యాక్‌లు, ఆఫీస్ టేబుల్, 20 కుర్చీలు, విద్యార్థులకు భోజన ప్లేట్లు, గుర్తింపు కార్డులు, బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినోద్‌కుమార్, వెంకటేశ్, రమేశ్, రాజు, సంగీత, శ్రీదేవి, మీనాకుమారి, ఆంజనేయులు, నరేష్, నాగలత పాల్గొన్నారు.




విద్యార్థులు, టీచర్లతో రిటైర్డ్ జీహెచ్‌ఎం పురుషోత్తంశాస్త్రి, హెచ్‌ఎం రామకృష్ణారెడ్డి

## అట్రాసిటీ కేసుల్లో చర్యలపై డీఎస్పీ నిర్లక్ష్యం

● రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ప్రజాసంఘాల ఫిర్యాదు

తాండూరు రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బెల్కటూర్‌లో దళిత యువకుడి పెళ్లి బారాత్‌ను అడ్డుకొని అవమానించిన వారిని అరెస్టు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. గురువారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఈ మేరకు నాయకులు వినతిపత్రం అందజేశారు. అలాగే చెనిగేష్‌పూర్‌లో ఎరుకల వారి కుటుంబంపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అట్రాసిటీ కేసుల్లో నిందితులపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్న తాండూరు డీఎస్పీపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మహిపాల్, ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.నర్సింహులు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మల్కయ్య, నాయకులు బుగ్గప్ప, కృష్ణ, బలరాం, నరేష్, సురేష్, గోపాల్, రమాకాంత్, బస్వరాజ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలందక పశువైద్య సిబ్బంది ఇబ్బందులు

కందుకూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పశుసంచార అంబులెన్స్ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక పశుసంచార అంబులెన్స్‌ను ప్రవేశపెట్టింది. తాము గ్రామాల్లో పశువులకు చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదని అంబులెన్స్



పశుసంచార అంబులెన్స్ సిబ్బంది

వైద్యాధికారి పృథ్వీరాజ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో తిరుగుతూ అనారోగ్యం పాలైన పశువులు, గొర్రెలు, మేకలకు చికిత్సలు అందజేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం తమకు వేతనాలు సకాలంలో ఇవ్వడం లేదని, వైద్య పరీక్షలకు కూడా మందులు సరఫరా చేయడం లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది సాయికిరణ్, నాగరాజు, వెంకటేష్ ఉన్నారు.

## జీవాలకు సకాలంలో టీకాలు వేయించాలి

షాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా ఉండేలా కాపరులు జాగ్రత్తలు తీసుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం హైతాబాద్ తండా, రాంసింగ్ తండాల్లో గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. జీవాలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు టీకాలు, మందులు వేయించాలన్నారు. కాపరులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది గోపి, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న పశువైద్యుడు

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి అదృశ్యం.. లొకేషన్ ట్రేస్ చేసి గుర్తించిన పోలీసులు

కేశంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న ఇంట్లోంచి వెళ్లిపోయి అదృశ్యమైన మామిడి శివగౌడ్ కథ సుఖాంతమైంది. పోలీసులు మొబైల్ లొకేషన్ ట్రేస్‌చేసి శివగౌడ్‌ను ఏపీలోని కర్నూల్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కొత్తపేటకు చెందిన శివగౌడ్ జర్నలిస్టుగా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ గొడవలతో మనస్తాపం చెంది ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ నెల 17న వాట్సాప్ స్టేటస్‌లో చనిపోతానంటూ వీడియో పెట్టాడు. దీంతో కుటుంబీకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేశంపేట సీఐ నరహరి, శివగౌడ్ ఫోన్ లొకేషన్ ట్రేస్ చేయించారు. మొదట లొకేషన్ వరంగల్ చూపడంతో కానిస్టేబుల్ అశోక్‌రెడ్డితో కుటుంబీకులను అక్కడికి పంపారు. అక్కడ ఆచూకీ లభ్యం కాక మరోసారి లొకేషన్ ట్రేస్ చేయగా కర్నూల్ రైల్వేస్టేషన్ చూపింది. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి బుధవారం రాత్రి 11గంటలకు శివను అదుపులోకి తీసుకున్నారు. గురువారం గ్రామానికి తీసుకొచ్చారు. శివగౌడ్ అఘాయిత్యం చేసుకోకుండా వెతికి పట్టుకున్న సీఐ, ఎస్ఐ రాజ్‌కుమార్, పీసీ అశోక్‌రెడ్డిలను గ్రామస్తులు అభినందించారు.



శివను అదుపులోకి తీసుకుంటున్న పీసీ అశోక్‌రెడ్డి

## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మేనత్తను హత్య చేసిన నిందితుడికి రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపిన ప్రకారం వివరాలు ప్రకారం.. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం చర్లపల్లికి చెందిన ఎరుకల లక్ష్మమ్మ(53), భర్త సత్తయ్య, ఇద్దరు కొడుకులు రాజు, కిరణ్ కుమారులతో హైదరాబాద్ శివార్లలోని ఇంజాపూర్‌లో స్థిరపడ్డారు. సత్తయ్య వాచ్‌మన్‌గా, లక్ష్మమ్మ కూలి చేసుకుంటున్నారు. కాగా లక్ష్మమ్మ అన్న కొడుకు మాదగోని రాజు(29) కారు డ్రైవింగ్ పనిచేస్తూ కమ్మగూడలోని ఇందిరమ్మ కాలనీలో ఉండేవాడు. లక్ష్మమ్మ వద్ద రాజు కొన్ని నెలల క్రితం కొంత డబ్బు తీసుకున్నాడు. అసలు చెల్లించగా మిత్తి ఇవ్వలేదు. మిత్తి డబ్బులు రాజును లక్ష్మమ్మ ఇవ్వాలని పలుమార్లు అడిగింది. ఫిబ్రవరి 17న సాయంత్రం రాజు.. లక్ష్మమ్మ ఇంటికి వచ్చాడు. తనకు రావాల్సిన మిత్తి డబ్బులు ఇవ్వాలనీ ఆమె నిలదీయగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. రాజు సిమెంట్ ఇటుకతో లక్ష్మమ్మ తలపై కొట్టాడు. దీంతో తలపగిలి లక్ష్మమ్మ మృతిచెందింది. లక్ష్మమ్మ కొడుకు ఎరుకల కిరణ్‌కుమార్ వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు రాజును రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పూర్వపరాలు పరిశీలించిన రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ నిందితుడికి జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

## రోడ్డు విస్తరణకు సహకరించాలి



సమావేశంలో చర్చిస్తున్న ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో చేపట్టిన రోడ్డు వెడ్పల్పు, రైల్వే బ్రిడ్జి పనులు త్వరగా పూర్తిచేసి ప్రజల ఇబ్బందులను తీర్చాలని నిర్ణయించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని తదితరులు మాట్లాడారు. యంనంపేట్ చౌరస్తా నుంచి మాధవరెడ్డి రైల్వే వంతెన వరకు వంద అడుగుల రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఇందుకు రూ.30కోట్లు మంజూరయ్యాయని, పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు టీడీఆర్‌లను ఇచ్చి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, తహసీల్దార్, రజని, ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## కల్లు దుకాణాల తనిఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తుమ్మలపల్లిలో కల్లు దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

చౌదరిగూడ, జూన్19(ఆంధ్రజ్యోతి):జిల్లేడ్ చౌదరిగూడ, కొందుర్గు మండలాల్లోని గ్రామాల్లో కల్లు దుకాణాలను షాద్‌నగర్ ఎక్సైజ్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'కల్లు కాదు.. కాలకూట విషం' శీర్షికన కల్తీ కల్లుపై ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించారు. కొందుర్గు మండలం లాలాపేట్, చిన్న ఉమ్మెంత్యాల, జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి, చౌదరిగూడల్లోని కల్లు దుకాణాలను తనిఖీ చేసి కల్లు శాంపిల్ తీసుకున్నారు. వాటిని ల్యాబ్‌కు పంపుతామని, హానికారక రసాయనాలు వాడినట్టు నిర్ధారణైతే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్సై సునీత తెలిపారు.



మోడల్ స్కూల్‌లో సోలార్ గ్రిడ్‌ను ప్రారంభిస్తున్న అమెజాన్ ప్రతినిధులు

## విద్య, వైద్యం కోసం 'అమెజాన్' కృషి

షాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే పాఠశాలలో మెరుగైన సదుపాయాల కల్పించాలని అమెజాన్ సీఎస్ఆర్ విభాగాధిపతి తాతాజీ అన్నారు. మండల పరిధి తెలంగాణ మోడల్ స్కూల్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోలార్ గ్రిడ్‌ను పర్యావరణవేత్త లిబోకోహెన్, రాజేష్ మైసా, రీజినల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ వినియ్‌కుమార్‌లతో కలిసి గురువారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. విద్యా, వైద్యం అంశాల్లో సదుపాయాలు కల్పించేందుకు అమెజాన్ వెబ్ సర్వీసెస్ డబ్బు వెచ్చిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత, అమెజాన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను గడువులోగా నిర్మించాలి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను గడువులోపు నిర్మించుకోవాలని అదనపు కలెక్టర్ రాధికగుప్తా తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి ఘనాపూర్‌లోని ఇందిరమ్మ ఇళ్లను, ఎదులాబాద్‌లోని అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను గురువారం ఆమె పరిశీలించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. గడువులోపు ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో కవితా యాదవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మారుతి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్పీకర్‌ను కలిసిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న బక్కి వెంకటయ్య

వికారాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం వికారాబాద్ వచ్చిన ఆయన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్పీకర్‌ను కలిసి సన్మానించారు.

### శుభప్రద్‌పటేల్ నివాసానికి బక్కి వెంకటయ్య

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించేందుకు వికారాబాద్‌కు వచ్చిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ నివాసానికి వెళ్లారు. శుభప్రద్.. చైర్మన్ వెంకటయ్య, సభ్యులు రాంబాబునాయక్, జిల్లా శంకర్‌లను సన్మానించి తేనీటి విందు ఇచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్ సుధాంశ్‌కిరణ్ పటేల్, సురేష్‌గౌడ్, దేవదాస్, కేదార్‌నాథ్, శాంతకుమార్, రుక్కుం, సిద్ధిఖి పాల్గొన్నారు.

## భూ రిజిస్ట్రేషన్ కోసం శంకర్‌పల్లికి మాజీ సీఎం



తహసీల్దార్ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి

శంకర్‌పల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. భూమి రిజిస్ట్రేషన్ విషయమై ఆయన గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్ సురేందర్‌తో కొద్దిసేపు మాట్లాడారు. జన్వాడలోని సర్వే నంబర్ 724లో గల 1ఎకరం 20గుంటల భూమిని ఆయన వేరొకరికి విక్రయించగా, భూమిని రిజిస్ట్రేషన్ చేయించేందుకొచ్చారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసిన వెంటనే ఆయన హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.

## వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

శంకర్‌పల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గురువారం ఆర్‌అండ్‌బీ గెస్టుహౌస్‌లో ఉచిత కంటివైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 11వ వార్డులో రూ.31.45 లక్షలతో చేపట్టిన అంతర్గత మురుగుకాలువ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. కమిషనర్ యోగేష్, ఏఎంసీ వైస్‌చైర్మన్ చంద్రమోహన్, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, చంద్రమౌళి, అశోక్, గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

# కొందరికే భరోసా!

(ఐదో పేజీ తరువాయి)

సాయం అందకపోవడంతో విత్తనాల కొనుగోలు భారంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనాల కొనుగోలు కోసం అప్పులు చేసే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

### 9 మండలాల్లో అసలే జమకాని సాయం

జీహెచ్ఎంసీ పరిధిలోని గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, మహేశ్వరం, బాలాపూర్, శేరిలింగంపల్లి, హయత్‌నగర్ మండలాల్లోని రైతులకు కనీసం ఒక్కరూపాయి కూడా ఖాతాల్లో జమ కాలేదు. ఈ తొమ్మిది మండలాల్లో పూర్తి వ్యవసాయ భూములు 54 వేల ఎకరాలు ఉండగా, పంటలు సాగు చేస్తున్న భూములు 38,184 ఎకరాలు ఉండగా.. 36,220 మంది రైతులు ఉన్నారు. వీరెవరికీ రైతు భరోసా అందలేదు. ఔటర్‌ను అనుసరించి ఉన్న ఈ మండలాల్లో రియల్ ఎస్టేట్ ఎక్కువగా ఉన్నందున రైతు భరోసాను నిలిపివేసారని ప్రచారం జరుగుతుంది. దీనిపై వెంటనే క్లారిటీ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మండలాల్లో ఎందుకు పెట్టుబడి సాయం జమకాలేవన్న విషయం వ్యవసాయాధికారులకు కూడా తెలియడం లేదు. ఆలస్యంగా వస్తాయని చెబుతున్నారు. పెట్టుబడి సాయం



చేవెళ్లలో రైతు భరోసా కోసం అధికారుల వద్ద రైతులు

కోసం బ్యాంకు అధికారులతో పాటు వ్యవసాయాధికారుల చుట్టూ రైతులు తిరుగుతున్నారు. ప్రభుత్వం నుంచి ఇంకా రావాల్సి ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్లాట్లు, సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించారు. ఇందులో భాగంగానే జీహెచ్ఎంసీ పరిధిలోకి వచ్చే భూములకు రైతు భరోసా నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ప్రతిపక్ష నేతలు రైతులతో కలిసి ఉద్యమానికి సిద్ధమయ్యారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి రైతు భరోసా విడుదల చేయాలని కోరారు. స్పందించిన మంత్రి.. అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు.

### రైతుల ఫోన్లకు జవాబివ్వని అధికారులు

రైతు భరోసా అమలు వ్యవసాయ శాఖకు తలపోటుగా మారింది. జిల్లా వ్యవసాయాధికారి నుంచి మొదలు వ్యవసాయ విస్తరణాధికారుల వరకు రైతుల నుంచి వస్తున్న ఫోన్లకు జవాబివ్వలేకపోతున్నారు. అర ఎకరం, ఎకరంన్నరలోపు భూములున్న సన్న, చిన్నకారు రైతులను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని రైతులు ఆరోపిస్తున్నారు. కొంత మంది పట్టాదారు పాసు పుస్తకంలో ఉన్న విస్తీర్ణానికి భిన్నంగా తక్కువగా నగదును ప్రభుత్వం జమ చేసింది. ఎందుకు? ఏమిటీ? అనేదానికి సమాధానం దొరకడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటి వరకు 4ఎకరాల్లోపు రైతులకు పెట్టుబడి సాయం విడుదల చేసినట్లు వ్యవసాయాధికారులు అధికారికంగా చెబుతున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో భిన్న పరిస్థితులు నెలకొన్నాయి.

### ఒక్క మండలానికే సాయం

**మేడ్చల్ జిల్లాలో మొత్తం 11 మండలాలు**

మేడ్చల్ /ఘట్‌కేసర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తొమ్మిది రోజుల్లో రైతులందరికీ రైతు భరోసా నిధులు జమ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ఓఆర్‌ఆర్ సమీప మండలాల్లో ఇప్పటివరకు ఏ ఒక్క రైతుకు కూడా రైతు భరోసా నిధులు జమ కాలేదు. జిల్లాలో ఆరు గ్రామీణ, ఐదు పట్టణ మండలాల్లో సుమారు 45,103 ఎకరాల విస్తీర్ణంలో 40,443 మంది రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలోని రైతులకు రూ.24కోట్ల రైతు భరోసా నిధులు జమ కావాల్సి ఉంది. జిల్లాలో మేడ్చల్, శామీర్‌పేట, కీసర, ఘట్‌కేసర్, దుండిగల్, కుత్బుల్లాపూర్, అల్వాల్ మండలాల్లోని గ్రామాల రైతులకు ఇప్పటివరకు రైతుభరోసా నిధులు జమ కాలేదు. కేవలం మూడుచింతలపల్లి మండల రైతులకు మాత్రమే రైతు భరోసా నిధులు జమ అయ్యాయి. దీంతో ఆయా మండలాల రైతులు గురువారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టి కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ శాఖ కమిషనర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు. ఆయా మండలాల రైతులకు రైతు భరోసా నిధులు జమ కాకపోవడంపై అధికారులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. బహుశా సిటీ శివారులో ఉండటమే కావచ్చునని చెబుతున్నారు. మరో పక్క జిల్లా పూర్తిగా అర్బన్ ప్రాంతంగా మారింది. స్థానిక సంస్థల(సర్పంచ్, ఎంపీటీసీ) ఎన్నికలు లేని కారణంగా రైతు భరోసా నిధులు విడుదల కావడం లేదనే ప్రచారం కూడా జరుగుతున్నది. జిల్లాలో నాలుగో రోజు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ అయినట్లు జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 4,624 మంది రైతులకు రూ.3.18 కోట్లు జమ అయినట్లు పేర్కొన్నారు.

#### కలెక్టర్ తీరుపై బీఆర్ఎస్ విమర్శలు

మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తీరుపై గురువారం బీఆర్ఎస్ నాయకుల విమర్శలు సోషల్ మీడియాలో వెల్లువెత్తాయి. రైతుభరోసా నిధులపై తనను కలిసేందుకు వచ్చిన రైతులను కలెక్టర్ కనీసం కూర్చోపెట్టకుండా అగౌరపర్చారని, మరోపక్క తనను సన్మానించేందుకు వచ్చిన కాంగ్రెస్ నాయకులను కూర్చోబెట్టి రాచమర్యాదలు చేశారనే విమర్శలు టీవీలు, సోషల్ మీడియాలో చక్కెర్లు కొట్టాయి. 'ఇదేనా ఒక యువ కలెక్టర్ తీరు.. కలెక్టర్ కాంగ్రెస్‌కు దాసోహం' అంటూ విమర్శలు చేశారు.

### రైతు భరోసా రాకపోవడంపై నిరసన

ఇబ్రహీంపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 9 మండలాల్లో రైతు భరోసా నిలిపివేయడంపై బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపట్నం చౌరస్తా వద్ద రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. సాగు భూములకే రైతు భరోసా అంటూ ఔటర్‌ను అనుసరించి ఉన్న మండలాల్లో ఈ సాయాన్ని నిలిపివేయడమేమిటంటూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోరెడ్డి నర్సింహారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి ప్రశ్నించారు. నిరసనకారులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో గోదల శేఖర్‌రెడ్డి, ముత్యాల మహేందర్, నేముల దయానంద్‌గౌడ్, ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ, అంజయ్య యాదవ్, పోరెడ్డి అర్జున్‌రెడ్డి, పాపయ్యగౌడ్, టేకుల రాంరెడ్డి, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

### రంగారెడ్డి జిల్లాలో రూ.165.79కోట్లు

ప్రస్తుత వానాకాల సీజన్‌లో 2,06,526 మంది రైతులకు రూ.165.79 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. 2024-25 యాసంగిలో 2,18,418 మంది రైతులకు రూ.177.61 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. గత ఏడాదితో పోల్చితే ఇంకా 11,892 మందికి రైతు భరోసా జమ కావాల్సి ఉంది. వీరంతా పెట్టుబడి సాయం కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. సకాలంలో పెట్టుబడి సాయం అందకపోతే పనులు ఆలస్యమై దిగుబడులపై ప్రభావం చూపుతుందని ఆందోళన చెందుతున్నారు. రైతు భరోసా అందని వారు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

### ఒక్క రూపాయి రాలే..



నా భార్య పేరిట 1.01 ఎకరాల భూమి ఉంది. ప్రధాని మోదీ వేస్తున్న పెట్టుబడి సాయం అందుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం రూపాయి కూడా పెట్టుబడి సాయం అందలే. పలు మార్లు వ్యవసాయాధికారులకు తెలిపినా, అవసరమైన పంట పాసుబుక్కు వంటి పత్రాలు అందించాను. సాయం అందలే. వస్తదనే నమ్మకం లేకుండా పోతుంది. ఉన్నతాధికారులు స్పందించి రైతు భరోసా వచ్చేలా చూడాలి.

**అశోక్ చారి, కౌకుంట్ల రైతు**

# ఎమ్మెల్యే వద్దన్నా.. టెండర్ లేకుండా!

- రూ.అరకోటి శానిటేషన్ మెటీరియల్ ఆర్డర్
- హాకాకు కట్టబెట్టిన మునిసిపల్ కమిషనర్

తాండూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో రూ.అరకోటి పెట్టి కొన్న మెటీరియల్‌పై దుమారం రేగుతోంది. ఎక్స్ ఆఫీషియో సభ్యుడైన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి తెలియకుండానే ఈ వ్యవహారం జరగడంపై కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నారు. మున్సిపాలిటీలో టెండర్ లేకుండా రూ.50 లక్షల శానిటేషన్ మెటీరియల్ కొన్నారు. హాకా కంపెనీకి నామినేషన్ విధానంపై అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) అనుమతితో మెటీరియల్ సప్లయ్ కాంట్రాక్ట్ కట్టబెట్టారు. అది కూడా కాంట్రాక్టర్‌కే అప్పగించడం గమనార్హం. గతంలో ఇదే సంస్థ నుంచి శానిటేషన్ మెటీరియల్‌ను రూ.40లక్షలకు కొనేందుకు సమావేశంలో చర్చించగా అంత మొత్తం అవసరంలేదని కౌన్సిలర్లు తిరస్కరించారు. ఈ కాంట్రాక్ట్ చేసుకోవద్దని ఎమ్మెల్యే సైతం కమిషనర్‌ను ఆదేశించారు. ఐదు నెలలు తిరక్కుండానే రూ.10లక్షలు పెంచి అంతే మెటీరియల్ కొనుగోలుకు ఆర్డరివ్వడం ఇప్పుడు అనుమానాలకు తావిస్తోంది. స్టాండింగ్ కౌన్సిల్ లేని సమయంలో ఎమ్మెల్యే దృష్టికైనా తేకుండా పెద్ద మొత్తంలో వర్క్ ఆర్డర్ ఇవ్వడంలో ఎవరి హస్తం ఉందన్న దానిపై పట్టణ కాంగ్రెస్ నాయకులు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే కొంత మెటీరియల్ మునిసిపల్ కార్యాలయానికి చేరింది. ఇదిలా ఉంటే గతంలో హాకా సరఫరా చేసిన మెటీరియల్ నాసిరకంగా ఉందనే విమర్శలున్నాయి. బల్దియాలో ఉన్న 200 మంది కార్మికులకు ఇచ్చే మెటీరియల్‌కు ఇంత ఖర్చవుతుందా? అన్న చర్చా నడుస్తోంది.

## ఒక్క రోజులో ఆలయాల సందర్శన

- ఆర్టీసీ ఆధ్వర్యంలో టూర్ ప్యాకేజీ
- హకీంపేట ఆర్టీసీ డీఎం భవభూతి



శామీర్‌పేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రల సందర్శనకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని శామీర్‌పేట ఆర్టీసీ డిపో మేనేజర్ భవభూతి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27 నుంచి తెలంగాణాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించే విధంగా బస్సు సర్వీసులను నడుపుతున్నట్టు తెలిపారు. ప్యాకేజీ-1లో భాగంగా శామీర్‌పేట మండలంలోని రత్నాలయం, మజీద్‌పూర్ వేంకటేశ్వరాలయం, సిద్దిపేట జిల్లా వర్గల్ సరస్వతీ ఆలయం, కొమురవెల్లి మల్లన్న, కొలనుపాక శివాలయం, బుద్ధ దేవాలయం, భువనగిరి సమీపంలోని స్వర్ణాలయాల సందర్శన ఉంటుందన్నారు. ఇందుకు పెద్దలకు రూ.500, పిల్లలకు రూ.350 చార్జి ఉంటుందని తెలిపారు. ఈ బస్సు ఉదయం 6గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరుతుందన్నారు. అలాగే ప్యాకేజీ-2లో వరంగల్ రామప్ప ఆలయం, లక్నవరం సరస్సు, వరంగల్ భద్రకాళి ఆలయం. వేయి స్తంభాలగుడి, స్వర్ణగిరి ఆలయాల సందర్శనం ఉంటాయన్నారు. ఈ ప్యాకేజిలో పెద్దలకు రూ.830, పిల్లలకు రూ.450 చార్జి ఉంటుందన్నారు. బస్సు ఉదయం 4గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరుతుందని వివరించారు. ఆలయాల సందర్శన అనంతరం తిరిగి స్టేషన్‌లో దించుతాంమని తెలిపారు. మరిన్ని వివరాలకు భక్తులు 9959226144, 9063816338 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కాగా ప్రత్యేక ప్యాకేజీలో మహాలక్ష్మి పథకం(మహిళలకు ఉచిత ప్రయాణం) వర్తించదని డీఎం చెప్పారు.

# పత్తివైపు రైతుల మొగ్గు

- భారీగా పెరగనున్న తెల్లబంగారం సాగు విస్తీర్ణం



చేవెళ్లలో పత్తి విత్తుతున్న మహిళలు

చేవెళ్ల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం రైతులు పండించిన పంటలకు చాలావాటికి ధర తక్కువ ఉండేది. ఒక్క పత్తి ధర మాత్రమే నిలకడగా ఉంది. ఈ నేపథ్యంలో పత్తిసాగుపై ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇటీవలి వర్షాలకు డివిజన్‌లోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లో పత్తి పంట 37,045 ఎకరాల్లో సాగు చేశారు. ఇదిలా ఉంటే 62,440 ఎకరాల్లో పత్తి వేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. రైతులకు అవసరమైన బీటీ-2 రకం పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. బీటీ-2 రకం విత్తనాల ప్యాకెట్ ఏ కంపెనీ అయినా ప్యాకెట్ ధర రూ.901కి అమ్మాలని విత్తన వ్యాపారులకు అధికారులు సూచించారు. అధిక ధరలకు అమ్మితే డీలర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. అధికారులు ఫర్టిలైజర్ దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ నాసిరకం విత్తనాలు అమ్మకుండా చర్యలు తీసుకుంటున్నారు.

### లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి



లైసెన్స్ ఉన్న ఎరువులు, విత్తనాల డీలర్ల వద్దనే పత్తి, మొక్కజొన్న ఇతర విత్తనాలు కొనుగోలు చేయాలి. వాటికి రసీదు తప్పక తీసుకోవాలి. పత్తి ప్యాకెట్ ధర రూ.901 ప్రభుత్వం నిర్ణయించింది. అధిక ధరలకు అమ్మినా, నాసిరకం విత్తనాలు విక్రయించినా లైసెన్స్ రద్దు చేస్తాం.

**- శంకర్‌లాల్, ఏవో, చేవెళ్ల**

## సామాజిక తనిఖీల్లో సమగ్ర వివరాలు సేకరించాలి

తాండూరు రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధి గ్రామాల్లో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందాలు సమగ్ర వివరాలను సేకరించాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ కొమరయ్య అన్నారు. గురువారం మండల పరిషత్‌లో ఎంపీడీవో విశ్వప్రసాద్ అధ్యక్షతన 16వ సామాజిక తనిఖీ బృందం సభ్యులతో సమావేశం నిర్వహించారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు చేసిన పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ కాలంలో రూ.6.12కోట్లు కూలీలకు చెల్లింపులు, పనిముట్లు, ఇతర సామగ్రి కొనుగోళ్లకు రూ.3.58కోట్లు వెచ్చించినట్టు తేల్చారు. పనుల్లో అవినీతి జరిగిందా? పనులు అసంపూర్తిగా ఉన్నాయా? లెక్కల్లో తేడాలున్నాయా? అనే అంశాలపై 16 మంది డీఆర్పీలు గ్రామాల్లో వారంపాటు తనిఖీ నిర్వహిస్తారన్నారు. తనిఖీ బృందాలకు పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, కూలీలు సహకరించి వివరాలందజేయాలని సూచించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు తనిఖీ బృందాలకు పనులు చేసిన ప్రదేశాలను చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో నరోత్తంరెడ్డి, డీఆర్పీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## నిధులు దుర్వినియోగం చేస్తే చర్యలు

(ఐదో పేజీ తరువాయి)

వికాసంలో ఎస్సీ, ఎస్టీలకు వాటాలకు అనుగుణంగా అవకాశాలు కల్పించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు సరైన న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్, సభ్యులు లక్ష్మీనారాయణ, శంకర్, రాంబాబు నాయక్‌కు కలెక్టర్ ప్రతీక్‌జైన్ జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. అనంతరం కొత్తగడిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను సందర్శించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కిచెన్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. భోజనం, ఇతర సదుపాయాలపై ఆయన ప్రిన్సిపాల్ సాయిలత, జిల్లా గిరిజన సంక్షేమాధికారి కమలాకర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించి విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, ఎం.సుధీర్, డీవీఎంసీ సభ్యులు పెండ్యాల అనంతయ్య, గోవింద్‌నాయక్, దస్తప్ప, ఎస్.రాజలింగం పాల్గొన్నారు.

## బషీరాబాద్ రోడ్డుకు మహర్దశ

● రూ.68లక్షలతో నాలుగు లేన్ల రోడ్డు పనులు షురూ



బషీరాబాద్ మార్గంలో ఎన్కెపల్లి వద్ద కొనసాగుతున్న నాలుగులేన్ల రోడ్డు పనులు

బషీరాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బషీరాబాద్-లక్ష్మీనారాయణపూర్ వరకు నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ నుంచి వెళ్తున్న జాతీయ రహదారిని అనుసంధానిస్తూ బషీరాబాద్ వరకు గల 18 కిలోమీటర్ల డబుల్ రోడ్డును రూ.68లక్షల వ్యయంతో నాలుగులేన్ల రోడ్డుగా నిర్మించబోతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఎన్కెపల్లి గేటు సమీపంలోంచి నాలుగు లేన్ల రోడ్డు విస్తరణ పనులు మొదలుపెట్టారు. ఓపక్క రోడ్డును తవ్విమొరం, కంకర వేసే పనులు చేపడుతున్నారు. ఈమార్గంలో ఏడేళ్ల కిందట అటవీశాఖ అధికారులు పలుచోట్ల నాటిన మొక్కలు చెట్లవగా వాటి తొలగింపునకు ఆ శాఖ నుంచి ఇంకా అనుమతి రాకపోవడంతో చెట్లులేని ప్రాంతంలో కాంట్రాక్టర్ రోడ్డు విస్తరణ పనులను ముమ్మరం చేశారు.

## డాక్టరేట్ పొందిన ఉస్మాన్‌కు సన్మానం



ఎండీ.ఉస్మాన్‌ను సన్మానించిన పీఆర్‌టీయూ నాయకులు

తాండూర్ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): హన్వాడ మండలంలోని వేపూర్ గ్రామానికి చెందిన ఎండీ.ఉస్మాన్ ఓయూ సమాజ శాస్త్ర విభాగంలో డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎండీ.ఉస్మాన్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ తాండూర్ మండల అధ్యక్షుడు వినోద్, కార్యదర్శి పురుషోత్తం, ఎంఈవో వెంకటయ్యగౌడ్, జైపాల్‌రెడ్డి, మృత్యుంజయ స్వామి, నాగప్ప, రవి, వీరేశం పాల్గొన్నారు.

## బీజేపీలోకి కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్



శరత్‌కుమార్‌రెడ్డి

దోమ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి బీజేపీలో చేరారు. ఆన్‌లైన్ ద్వారా బీజేపీ సభ్యత్వాన్ని పొందిన ఆయన గురువారం మాట్లాడుతూ బీజేపీ విధి విధానాలు నచ్చి పార్టీలో చేరినట్లు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశంలోని ప్రతీ పౌరుడు ఆయన నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. పార్టీ నియమ, నిబంధనలకు కట్టుబడి ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## చిన్నారులకు అక్షరాభ్యాసం

బొంరాస్‌పేట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఏర్పుమళ్ల ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం బాడిబాట నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేశ్‌రాథోడ్, ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, పాఠశాల కమిటీ చైర్ పర్సన్ వసంత, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల బారినపడి మోసపోవద్దు

యాలాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరాల బారిన పడి ప్రజలు మోసపోవద్దని ఏఎస్ రామచందర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా చేసి ఫోన్ నెంబర్లు, బ్యాంకు అకౌంట్ నెంబర్లు, తదితర వాటి గురించి అడిగితే వివరాలు చెప్పవద్దని సూచించారు. మూఢ నమ్మకాలను నమ్మి మోసపోవద్దని అన్నారు. బాల్య వివాహాలు జరపరాదని తెలిపారు. చట్ట వ్యతిరేక విధానాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో యాలాల పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాండూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వికారాబాద్ జిల్లా దిశ కమిటీ సభ్యురాలు, మాజీ కౌన్సిలర్ అంతారం లలిత అన్నారు. తాండూరు పట్టణం ఎంపీటీ హాల్ ప్రాంతంలో గురువారం నిర్వహించిన వంద రోజుల కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. డ్వాక్రా మహిళలు తడి, పొడి చెత్తను వేరుగా అందించాలని కోరారు. చెత్త బుట్టలను ఇవ్వాలని పలువురు మహిళలు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, టీఎంసీ రాజేంద్రప్రసాద్, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ ప్రవీణ్‌గౌడ్, ఆర్పీ పాల్గొన్నారు.

## మేడ్చల్ పట్టణ అభివృద్ధికి కృషి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర బెవరేజెస్ త్రిసభ్యకమిటీ సభ్యుడు నవీన్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్ 4వ వార్డు అర్చనా కాలనీలో రూ.37.5లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. పట్టణంలోని కాలనీల్లో సీసీరోడ్లు, అంతర్గత డ్రైనేజీల ఏర్పాటుకు ప్రత్యేకంగా నిధులు రప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గోమారం రమణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు చీర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇరుకిరుకుగా వినాయక చౌరస్తా

● రోడ్డు విస్తరణలో జాప్యం
● తరచూ ప్రమాదాలు
● వాహనదారులకు తప్పని తిప్పలు



కొడంగల్ వినాయక చౌరస్తా దుస్థితి

కొడంగల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మున్సిపల్ అభివృద్ధి కోసం భారీగా నిధులు మంజూరైనా పనుల్లో పురోగతి కనిపించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలో ప్రధానంగా కొడంగల్ మీదుగా మహబూబ్‌నగర్-చించోలి రోడ్డు విస్తరణలో జాప్యం కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా కొడంగల్ పట్టణంలోని వినాయకచౌరస్తా చాలా ఇరుకుగా ఉండటంతో వాహనాలు ఎక్కడిక్కడే నిలిచిపోయి ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతోపాటు నాలుగు ప్రధాన రహదారులు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం, జూనియర్ కళాశాల, కోస్గి-కొడంగల్ మార్గాలను కలిపే చౌరస్తాలో ప్రమాదాలకు దారి తీస్తుంది. పట్టణంలోని హాస్టల్ నుంచి తాండూర్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనుల కోసం అధికారులు పలుమార్లు మార్కింగ్ వేసినా పనులు జరగకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

## నిబంధనలను అతిక్రమిస్తే గుర్తింపు రద్దు



ప్రసంగిస్తున్న ఎంఈవో వెంకటయ్య

తాండూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అతిక్రమించి విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను నిర్వహిస్తే భారీగా జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే పాఠశాల గుర్తింపు రద్దుకు సిఫార్సు చేస్తామని తాండూరు ఎంఈవో వెంకటయ్య హెచ్చరించారు. తాండూరులో గురువారం ప్రైవేటు పాఠశాలల ప్రిన్సిపల్ కరస్పాండెంట్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో ఎలాంటి పుస్తకాలు, నోట్‌బుక్‌లు విక్రయించరాదని చెప్పారు. అధిక ఫీజులు వసూలు చేయరాదని అన్నారు. పాఠశాలలో ట్యూషన్ ఫీజులు తప్ప ఎలాంటి ఫీజులు వసూల్ చేయవద్దని అన్నారు.

బొంరాస్‌పేట్: ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు పాటించాలని, పాఠ్యపుస్తకాలు, నోటు బుక్‌లు, యూనిఫాం తదితర వాటిని విక్రయించొద్దని ఎంఈవో హరిలాల్ సూచించారు. మండల కేంద్రంలోని టాయిని టాట్స్ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. పాఠశాల భవనం, తరగతి గదులు, మూత్ర శాలలు, ఆటస్థలం, సదుపాయాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాలని ఆదేశించారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేక్ కట్‌చేశారు. ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లుపంపిణీ చేశారు. విద్యార్థులకు నోటుబుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు.



కొడంగల్‌లో విద్యార్థులకు నోట్‌బుక్‌లు పంపిణీ చేస్తున్న నాయకులు



మేడ్చల్ టౌన్: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు



ఘట్‌కేసర్ రూరల్: అవుశాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



బొంరాస్‌పేట్‌లో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు



మర్పల్లి: కేక్ కట్‌చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు



దోమ: రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు లాల్‌కృష్ణ ప్రసాద్



ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ ఆర్జీకే కాలనీలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న వెంకటేష్‌గౌడ్



చౌడాపూర్‌లో రాహుల్‌గాంధీ బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

# సమస్యల పరిష్కారానికే 'భూభారతి'



నవాబుపేట: కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే ప్రభుత్వం భూభారతి కార్యక్రమాన్ని చేపట్టిందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఏక్‌మామిడిలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బుచ్చయ్య, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, కాంగ్రెస్ నాయకులు చిట్టెపు మల్లారెడ్డి, తలారి ప్రభాకర్, రామ్‌రెడ్డి, రాథోడ్ గీతాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: కరన్‌కోట్, ఓగీపూర్ గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తారాసింగ్ మాట్లాడుతూ కరన్‌కోట్‌లో 26, ఓగీపూర్‌లో ఏడు మొత్తం 33 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. నేటి(శుక్రవారం)తో సదస్సులు ముగియనున్నట్లు తెలిపారు. చివరి రోజు మల్‌రెడ్డిపల్లి, పాతతాండూరు, సాయిపూర్ ప్రాంతాలకు చెందిన రైతులు పాత ఎంపీడీవో కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లలిత, సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్ కుమార్, ఆర్ఐ గోపి పాల్గొన్నారు.

దోమ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతితో రెవెన్యూ సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ గోవిందమ్మ అన్నారు. మండలంలోని అయినాపూర్, గుండాల్ గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సిములు, ఆర్ఐలు సుదర్శన్, రాంచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బషీరాబాద్: ఈ నెల 3 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 155 దరఖాస్తులు వచ్చినట్లు బషీరాబాద్ తహసీల్దార్ షాహిదాబేగం తెలిపారు. ఆమె తన కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 31 రెవెన్యూ గ్రామాల్లో రెండు టీంల ద్వారా సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఈ దరఖాస్తులను ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఆగస్టు 15 లోపు పరిష్కారం చేయనున్నట్లు ఆమె వెల్లడించారు.

బొంరాస్‌పేట్: నాందర్‌పూర్‌లో తహసీల్దార్ పద్మావతి రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. శుక్రవారం ఏర్పుమళ్ల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

## 11ఏళ్లలో అనేక కేంద్ర పథకాలు అమలు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు సదానందారెడ్డి

వికారాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 11ఏళ్లలో కేంద్రంలో బీజేపీ అనేక పథకాలను అమలు చేసిందని బీజేపీ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు సదానందారెడ్డి అన్నారు. గొట్టిముక్కలో బుధవారం రాత్రి మండల అధ్యక్షుడు శివరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సేవా సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా సంకల్ప సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింగం, నరేష్, అమరేందర్‌రెడ్డి, బస్వలింగం, చంద్రశేఖర్, నర్సింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

### అభివృద్ధి పథంలో భారత్

మర్పల్లి: ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు పట్లోళ్ల రామేశ్వర్‌రెడ్డి అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రధాని మోదీ 11 సంవత్సరాల సేవా సుపరిపాలన వికసిత్ భారత్‌లో భాగంగా గురువారం మర్పల్లి మండలంలోని జంషేడ్‌పూర్, ఘనపూర్, పట్లూర్, కొంశెట్టిపల్లి, దర్గుల పల్లి, బిల్కల్ తదితర గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లేశ్ యాదవ్, శ్రీమంత్‌కుమార్, అన్నపూర్ణ, మహేశ్వరీ, జంగం జైపాల్, మహేశ్ పాల్గొన్నారు.



మర్పల్లి: మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు పట్లోళ్ల రామేశ్వర్‌రెడ్డి

## పత్తి రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

కొడంగల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పత్తిసాగు చేసే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏవో తులసి, ఏఈవో శ్రీపతిరెడ్డి అవగాహన కల్పించారు. రుద్రారం గ్రామంలో గురువారం పొలాల్లో పత్తివిత్తనాలు విత్తుతున్న రైతులకు పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, గ్రామస్థులు ఆనంద్‌రెడ్డి ఉన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



మేడ్చల్ కలెక్టర్ మను చౌదరితో మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా నాయకులు

దుండిగల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మను చౌదరిని గురువారం మేడ్చల్ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా మాజీ ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జ్ బండి రమేష్, మేడ్చల్ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, మేడ్చల్, మల్కాజ్ గిరి గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత

కొడంగల్ రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇళ్లు లేని పేదలకు సొంతిటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మంజూరైన 31ఇళ్ల ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని రుద్రారం గ్రామంలో గురువారం ఏఎంసీ చైర్మన్ అంబయ్యగౌడ్ లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. మైనార్టీ మహిళలకు రేవంతన్న భరోసా పథకం ద్వారా మంజూరైన 50 కుట్టుమిషన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనంద్ రెడ్డి, సాయిలు, వెంకటయ్య గౌడ్, నర్సింహులు, గోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

### క్రైం కార్నర్

## గంజాయి చాక్లెట్లు తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

● 5 కేజీల చాక్లెట్లు స్వాధీనం



నిందితుడు జయరామ్

మేడ్చల్ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి చాక్లెట్లు తరలిస్తున్న ఓవ్యక్తిని మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు అదుపులో తీసుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అయోధ్య చౌరస్తా వద్ద గురువారం ఎక్సైజ్‌పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై సుమారు ఐదు కిలోల గంజాయి చాక్లెట్లు తరలిస్తున్న జయరామ్(53) ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం నుంచి ఈగంజాయి చాక్లెట్లను తెప్పించి గుండ్లపోచంపల్లి, మేడ్చల్ పరిసర ప్రాంతాల్లోని కార్మికులకు, విద్యార్థులకు సరఫరా చేస్తాడని తెలిపారు. పక్కా సమాచారంతో వాహనాల తనిఖీ నిర్వహించి నిందితుడిని పట్టుకునట్లు సీఐ నవనీత తెలిపారు.

## ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఇందిరమ్మ ఇళ్లనిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

మూడుచింతలపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అద్రాస్‌పల్లి మాజీ ఎంపీటీసీ హన్మంత్‌రెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అద్రాస్‌పల్లిలో గురువారం 11ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నాయకుల యాదగిరి, ప్రవీణ్, భానుచందర్, దుర్గేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగ చిన్నారులకు ట్రైసైకిల్, పరికరాలు అందజేత



దివ్యాంగ చిన్నారులకు ట్రై సైకిల్, పరికరాలు అందజేస్తున్న టీవీవీ నాయకులు, ఉపాధ్యాయులు

దుద్యాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న దివ్యాంగ చిన్నారులకు ట్రైసైకిల్, పరికరాలు అందజేశారు. చరణ్‌కు సర్వశిక్షాభియాన్ ద్వారా ట్రైసైకిల్, 10వ తరగతి రాధికకు హియరింగ్ పరికరాన్ని ఎంఈవో విజయరామారావు, ఐఈఆర్‌పీ రాంశ్రీనివాస్‌బాబు అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, కేజీబీవీ ప్రిన్సిపాల్ రాధిక, సీఆర్‌పీ రాందాస్, ఉపాధ్యాయులు శంకరప్ప, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళా సంఘ భవనం మంజూరు చేయాలి



కడా ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందజేస్తున్న మహిళా సంఘం సభ్యులు

దుద్యాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) ఈర్లపల్లిలో డ్వాక్రా మహిళా సంఘం భవనం మంజూర్ చేయాలని కోరుతూ గురువారం కొడంగల్‌లో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. గ్రామంలో 26సంఘాలు ఉన్నాయని తెలిపారు. భవనం లేకపోవడంతో సమావేశాలు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా ముస్లిం శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవినాయక్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల చర్యలు

కులకచర్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. దుకాణాల ముందు వాహనాలు నిలిపితే వాహనదారులతో పాటు యజమానులపై చర్యలు తీసుకుంటామని నోటీసులు జారీ చేశారు. స్థానిక స్టేట్‌బ్యాంకు ముందు అడ్డగోలుగా బైక్‌లు నిలపడంతో ఆమార్గం మీదుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైనే తమ వాహనాలను నిలిపి వెళ్తున్నారు. వాహనాలు రోడ్డుపై నిలపడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రిటైర్డ్ ఉపాధ్యాయుడి ఔదార్యం

కొడంగల్ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ సింగ్ ఔదార్యాన్ని చాటుకున్నారు. మండల పరిధిలోని అప్పాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం 100 బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన చేసిన సాయం మరువలేనిదని పాఠశాల హెచ్ఎం విష్ణుకుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో బస్వరాజ్ గౌడ్, బాల్‌రాజ్, వెంకటయ్య, శివకుమార్, ఉపాధ్యాయులు అంజిలప్ప, అశోక్, ప్రభావతి, వెంకటమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం

దుద్యాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గురువారం ఎంఈవోలు విజయరామారావు, హరిలాల్, ఎస్ఐ యాదగిరి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, కేజీబీవీ ప్రిన్సిపాల్ రాధిక, ఉపాధ్యాయులు కరుణాకర్, తిరుపతయ్య, రాములు, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

## 'యోగా కౌంట్‌డౌన్'ను జయప్రదం చేయాలి

మేడ్చల్ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) పార్టీలకు అతీతంగా మేడ్చల్ పట్టణంలో శుక్రవారం(నేడు) నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా కౌంట్ డౌన్ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షురాలి శైలజ హరినాథ్ పిలుపునిచ్చారు. మేడ్చల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్, వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.